కఠిన శిక్షలు విధించాలి



ఎక్కడ నుంచో వచ్చి ఆ ప్రాంత వాసుల కోసం పనిచేస్తున్న వైద్యులకు వైద్య సిబ్బందికి భద్రత లేకపోతే ఎలా పనిచేస్తారు.. అందరూ ఆలోచించాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటన ఎంతగానో బాధించింది. అలాంటి సంఘటన కారకులపై విచారణ వేగవంతం చేసి వారికి కఠిన శిక్షలు విధించాలి. అలానే రాత్రి సమయాల్లో ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి.

- డాక్టర్ సుమన్, వైద్యాధికారి, మిడుతూరు, ఖాజీపేట

ప్రత్యేక భద్రత కల్పించాలి



పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత పెంచాలి. పని చేసే చోట కూడా వారికి భద్రత లేకుంటే ఎలా? కోల్‌కతా సంఘటన యావత్తు మహిళా లోకాన్ని, ఉద్యోగ స్త్రీలను భయాందోళలు చెందేలా చేసింది. అభద్రతా భావం నెలకొంది. వైద్యురాలి హత్యాచార కేసులో నిందితులను రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా కఠిన శిక్షలు వేసేలా చూడాలి. మహిళలపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

- విజయలక్ష్మి, ఏఎన్‌ఎం, అట్లూరు మండలం



ప్రాణాలు కాపాడుకుంటే దాడులా?



ప్రాణం పోసే వైద్యులపై దాడులు చేయడం దారుణం. కోల్‌కతాలో జరిగిన దాడి మరువక ముందే తిరుపతిలోనూ దాడికి యత్నించారు. ఇలాగైతే వైద్యులు ఎలా పనిచేయాలి. గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్ కింద విధులకు వెళ్ళే మహిళా వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురావాలి.

- డాక్టర్ బి.ప్రశాంతి, వైద్యాధికారి, కాశినాయన మండలం

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలకు భద్రత పెంచేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా మహిళలకు భద్రత కల్పించడంలో భాగంగా నిఘాను పటిష్టం చేయాలి. వైద్యులు, సిబ్బంది స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసేలా ఉండాలి. ప్రత్యేక నిఘా పెంచి వారికి సెక్యూరిటీ ఉండేలా చూడాలి.

- స్రవంతి, ఏఎన్‌ఎం, గంగనపల్లె, కాశినాయన మండలం

పచ్చగా పైరు.. చివరికి కన్నీరు

- మేఘావృత్తంగా ఉన్న చినుకు జాడలేని వైనం
- మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- వరుణుడు కరుణించకపోతే నష్టాలేనంటున్న రైతన్న

బి.కోడూరు : గత కొద్ది రోజులుగా ఆకాశంలో మేఘాలు వర్షం వచ్చేలా ఊరిస్తూ ఆవిరైపోతున్నాయి. పంటకు నీరందక రైతు కన్నీరే మిగిలింది. ప్రస్తుతం మండలంలో రైతులు సాగుచేసిన పంటలపై వరుణుడు ఆడుకుంటున్నాడు. ముఖ్యంగా మండలంలోని మున్నెల్లి, ఐత్రంపేట, అనుమోరుపల్లె, అక్కుపాలెం, మేకవారిపల్లె, మరాటిపల్లె, పాపానపల్లె, పాయలకుంట్ల, బి.కోడూరు, గుంతపల్లె తదితర గ్రామాల్లో బోరుబావుల కింద సుమారు 1200 ఎకరాలకు పైగా ముందస్తుగా వరి పంటను రైతులు సాగు చేశారు. పంట అంతా మొదటి దశలో కళకళలాడుతూ ఉంది. గతేడాది కూడా మండలంలో సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో కొన్నిచోట్ల బోరుబావుల్లో నీరు రాక వరినాట్లు ఎండిపోతున్నాయి. రైతులు చేసేదేమీ లేక ఆకాశం వైపు వరుణ దేవుడి కటాక్షం కోసం ఎదురు చూస్తున్నారు. గత వారం రోజులుగా ఆకాశమంతా మేఘావృతమై వర్షం వచ్చేలా ఊరించడం తప్ప ఒక్క చినుకు రాలలేదు. గతేడాది వరి ధాన్యానికి మంచి రేటు పలకడంతో పది రూపాయలు వెనకేసుకున్న రైతులు ఈ ఏడాది కూడా అలాగే నాలుగు కాసులు వెనుకేసుకోవాలనే ఉద్దేశంతో వరిపంటను సాగు



గుంతపల్లెలో బోరుబావుల కింద సాగు చేసిన వరిపంట



నీరు లేక వెలవెలపోతున్న మేకవారిపల్లె పెద్ద చెరువు

చేశారు. కానీ ఈ ఏడాది రైతుల ఆశలు ఆవిరయ్యేలా ఉన్నాయి. ఒక ఎకరా వరిపంటను సాగు చేయాలంటే పెరిగిన ధరలకు అనుగుణంగా ఎకరాకు సుమారు రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. వచ్చే వారం, పది రోజుల్లో మండలంలో వర్షపాతం నమోదుకాకపోతే సగానికి సగం గ్రామాల్లోని వరిపంట పశుగ్రాసానికి వదులుకోవాల్సి వస్తుందని మండల రైతులు వాపోతున్నారు. ఈ లెక్కన మండలంలో సుమారు ఒకటిన్నర కోట్ల రూపాయల మేర రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

గతేడాది కూడా మండలంలో సరైన వర్షపాతం నమోదు కాకపోయినప్పటికీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ప్రత్యేక చొరవతో బ్రహ్మంసాగర్ నీటిని ఎల్ఎస్‌పీ ప్రాజెక్టుకు అందించి ఎల్ఎస్‌పీ ఎడమ కాలువ ద్వారా సుమారు 36 ఆయకట్టు చెరువులకు నీరు అందించి పంటలను కాపాడటంతోపాటు యడకారు పైరుకు సైతం బ్రహ్మంసాగర్ నీటిని అందించారు. కానీ ఈ ఏడాది బ్రహ్మంసాగర్‌లో నీరు అడుగంటడంతో రైతుల ఆశలు ఆవిరయ్యేలా ఉన్నాయి.

బోరుబావిలో నీరు అడుగంటింది



గతేడాది నాలుగు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. బస్తా రూ.2 వేలు ప్రకారం పెట్టుబడి పోను రూ.1.50 లక్షలు ఆదాయం వచ్చింది. అదే ఆశతో ఈ ఏడాది కూడా మూడు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. కానీ వర్షాలు లేకపోవడంతో బోరుబావుల్లో నీరు అడుగంటింది. వర్షం రాకపోతే పశుగ్రాసానికి వదలాల్సి పరిస్థితి దాపురించింది

- సిద్దు బాలసుబ్బారెడ్డి, రైతు, మేకవారిపల్లె, బి.కోడూరు

తాగునీటికి కూడా కష్టాలే



వరి సాగు చేశాను. నీరు లేక పొలం ఎండిపోతోంది. వరుణుడు కరుణిస్తేనే తప్ప ఆశలు ఏమీలేవు. వారం, పది రోజుల్లో మండలంలో సరైన వర్షపాతం నమోదు కాకపోతే సాగు సంగతి దేవుడెరుగు పెద్దుళ్లపల్లె, శ్రీరామ్ నగర్ తదితర గ్రామాల్లో తాగునీటికి కూడా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం, అధికారులు సాగునీరు అందించి రైతులను ఆదుకోవడమే కాక రాబోయే రోజుల్లో తాగునీటి కష్టాలు లేకుండా చూడాలి.

- పీరయ్య, రైతు, పెద్దుళ్ళపల్లె, బి.కోడూరు మండలం

నేడు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరిస్తారన్నారు. ఉదయం ఏడు గంటలకు లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమం నిర్వహిస్తామని తెలిపారు.

రేపు లలిత నామ పారాయణం

ప్రొద్దుటూరు: స్థానిక శాస్త్రీనగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో ఈ నెల 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 300 మంది భక్తులచే లలిత నామాన్ని 15 లక్షల సార్లు పారాయణం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరిస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని రామాపురంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫి దాడులు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఇసుక తరలిస్తున్న పుల్లన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

పోరుమామిళ్ల : మండలంలోని రాజాసాహెబ్‌పేట పంచాయతీ తిరువెంగళాపురంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో 26 నుంచి మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జయంతి వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. జన్మాష్టమి రోజు గ్రామంలో రామస్వామి దేవాలయం వద్ద వేదిక నిర్మించి, శ్రీకృష్ణ ప్రతిమ ఏర్పాటు చేసి నిత్య పూజలు చేశారు. భగవద్గీత పారాయణం, ప్రవచనాలు నిర్వహించారు. ఉత్సవాలలో బుధవారం సాయంత్రం శ్రీకృష్ణ ప్రతిమను గ్రామంలో వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో తాడిపత్రి ఇందు జ్ఞానవేదిక సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఏడుకొండలు, రమేష్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ ఉండకూడదు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలో జరుగుతున్న మేజర్, మైనర్ డ్రైనేజీల పూడికతీత పనులు ప్రజలకు, వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిద్దవటం రోడ్డులో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడికతీత పనులు చేపట్టిన వెంటనే మురుగును నిల్వ ఉంచకుండా ఏరోజుకారోజు తొలగించాలని ఆదేశించారు. అలాగే నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను తెలియజేశారు. అలాగే వ్యాపారస్తులు, హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : ఏపీపీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ డి.చంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక డిపో ఆవరణలో రీజనల్ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో గురువారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

అట్లూరు : క్రీడలు ఉల్లాసం నింపడంతో పాటు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రహేష్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా దినోత్సవంతో పాటు ధ్యాన్‌చంద్ జయంతి జరుపుకోవడం ఆనవాయితీ వస్తుందని పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ ఒలింపిక్స్ చరిత్రలోనే ఎనిమిది పథకాలు సాధించాడన్నారు. అందులో మూడు బంగారు పథకాలు ఉండడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

ఆవులను వదిలితే గోశాలకు తరలిస్తాం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆవులను యజమానులు ఈ నెల 31వ తేదీలోగా తమ ప్రాంతాలకు తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అనంతరం రోడ్లపై ఆవులు కనిపిస్తే వాటిని పట్టుకుని గోశాలకు తరలిస్తామని ఆయన పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

రెండు గంటల్లోనే బాలిక ఆచూకీ గుర్తింపు

ప్రొద్దుటూరు క్రైం : తప్పిపోయిన బాలికను టూటౌన్ పోలీసులు రెండు గంటల్లోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. నంద్యాలకు చెందిన షాహిదా అనే బాలిక తల్లిదండ్రులతో కలిసి ప్రొద్దుటూరులోని దస్తగిరిపేటలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. బాలికకు సరిగామాటలు రావు. మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు, బంధువులు చుట్టు పక్కల గాలించినా బాలిక కనిపించలేదు. దీంతో బాలిక తల్లి యాస్మిన్ టూ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. సీఐ యుగంధర్, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డిలు వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ చంద్రానాయక్, హోంగార్డు ఉదయ్‌లు బాలిక కోసం విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో వైఎంఆర్ కాలనీలోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న షాహిదాను గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ తల్లిదండ్రులను పిలిపించి బాలికను అప్పగించారు. సకాలంలో స్పందించి తమ కుమార్తెను సురక్షితంగా తీసుకొచ్చిన టూ టౌన్ పోలీసులకు యాస్మిన్ కృతజ్ఞతలు తెలిపారు. సీఐ, ఎస్ఐతో పాటు బ్లూకోల్ట్స్ సిబ్బంది చంద్రానాయక్, ఉదయ్‌లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

బద్వేలు రూరల్ ఎస్ఐగా శ్రీకాంత్



బద్వేలు అర్బన్ : బద్వేలు రూరల్ ఎస్ఐగా కె.శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎస్ఐల బదిలీల్లో తిరుపతి జిల్లా శ్రీసిటీలో పనిచేస్తున్న ఆయనను బద్వేలు రూరల్‌కు నియమించారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఈయన నియోజకవర్గంలోని అట్లూరు, బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో గతంలో ఎస్ఐగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ బెట్టింగ్, మట్కా, జూదం, ఎర్రచందనం అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించి వారి ఫిర్యాదుల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ఏపీటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప ఏ ఇతర పెన్షన్ విధానాన్ని అంగీకరించమని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపీఎస్)పేరుతో కొత్త విధానాన్ని తీసుకు రావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1 నుంచి అన్ని తాలుకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శులు మునివర్ధన్ కుమార్, మైనారిటీ కన్వీనర్ అప్సర్ పాషా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య, సయ్యద్ బాషా, రాజుపాళెం మండల అధ్యక్షుడు నరసింహాకుమార్, జిల్లా కౌన్సిలర్లు ఈశ్వర్‌రెడ్డి, సురేష్, బాబుల్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్, విష్ణువర్ధన్, సుధాకర్, ఖాజాపీరా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బి.కోడూరు : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎల్‌పీఏ మండల జనరల్ సెక్రటరీ గడ్డం రాజకుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బి.కోడూరులో విలేకరులతో మాట్లాతూ మహిళలు రక్షణ చట్టాలు, వారి హక్కులు, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే, రాష్ట్రంలో మహిళలు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. అలాగే బాల్యవివాహాలు నిరోధించాలన్నారు. మహిళలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేసుకుని త్వరలో గ్రామాల్లో పర్యటించి గ్రామసభల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

అపరెల్ పార్కును ఏర్పాటుచేయాలి



డిప్యూటీ తహసీల్దారు వెంకటసాయినాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో అపరెల్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రజాపక్షం ప్రెసిడెంట్ పుత్తా లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజాపక్షం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ చేనేతల పోరాటాల ఫలితంగా 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అపరెల్ పార్కు ఏర్పాటుకు 76.17 ఎకరాల స్థలం కేటాయించిందన్నారు. ఈ స్థలంలో ఐదెకరాలు ఆర్టీఓ కార్యాలయానికి కేటాయించగా, మరో 71.17 ఎకరాలు మిగిలిందన్నారు. ఈ భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి కేటాయించిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ కింద ప్లాట్లుగా విభజించి విక్రయించిందన్నారు. తిరిగి ఇక్కడ అపరెల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.మల్లికార్జున శెట్టి, అబ్దుల్ రహీం, మునిసుబ్బారెడ్డి, శివరామకృష్ణ, ఓబుళరెడ్డి, వెంకటపతి, సుజాత, నాగలక్ష్మి, షర్మిల, దివ్యశ్రీ, యోహాన్‌పాల్గొన్నారు.

అప్పులు చేయడంలో దూసుకుపోతున్న ఏపీ

ప్రొద్దుటూరు క్రైం : అప్పులు చేయడంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు దూసుకు పోతున్నారని కాంగ్రెస్ నాయకుడు ఎన్ తులసిరెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం రెండున్నర నెలల్లో రిజర్వ్ బ్యాంకు వద్ద సెక్యూరిటీ బాండ్ల రూపంలో రూ.15 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. దీనికి తోడు రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు వద్ద రూ.15 వేల కోట్లు అప్పు చేయాలని నిర్ణయించడం శోచనీయమని చెప్పారు. శక్తికి మించి అప్పుచేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయవద్దని సూచించారు. అంతేగాక పారిశుధ్యం పడకేయడంతో రోగాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో జిలానీ బాషా, రామాంజనేయులు, రషీద్, ఖలందర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

బద్వేలు అర్బన్ : సీపీఎం పార్టీ కార్యకర్తలు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకుని ప్రజలను మూఢ నమ్మకాల నుంచి చైతన్యవంతులను చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న సీపీఎం శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త కృషి చేసి మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను, పట్టణ నాయకులు ఎం.చిన్ని, శివకుమార్, బాలగురయ్య, ఆదిల్, మోక్షమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూనె పంటల సాగుపై రైతులకు అవగాహన



ఉద్యాన పంటల గురించి వివరిస్తున్న శ్రీనివాసులురెడ్డి

బ్రహ్మంగారిమఠం : నూనెల దిగుమతి భారం తగ్గించాలంటే దేశంలో అధికంగా నూనె పంటను సాగుచేయాలని జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలుగురాళ్ళపల్లె రైతు సేవాకేంద్రంలో ఉద్యాన శాఖ, ఆయిల్ పామ్ కంపెనీ అయిన సువేన ఆగ్రోస్ ఇండీస్ట్రీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఉద్యానశాఖ అధికారి మాట్లాడారు. ప్రతి రైతు తనకు ఉన్న వ్యవసాయ పొలంలో కొంత వరకు పామ్‌ఆయిల్ సాగు చేసుకోవాలన్నారు. పండించిన పంటను ప్రభుత్వం ఒప్పందంతో ఉన్న ఆయిల్ కంపెనీలు కొనుగోలు చేస్తాయన్నారు. పూర్తి వివరాలకు సమీపంలో రైతుసేవాకేంద్రాలలో తెలుసుకోవాన్నారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సహాయకులు ఓబులేసు, కంపెనీ ప్రతినిధులు కొండారెడ్డి, డ్రిప్ ఏరియా అధికారి జయసుబ్బారెడ్డి, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు నాగిపోగు నారాయణ, మల్లేపల్లె మాజీ సర్పంచ్ నాగిపోగు పెంచలయ్య, రైతులు రాజేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, దుగ్గిరెడ్డి, రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జోనల్ కమిటీ మెంబర్ వి.రామకృష్ణయ్య డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వి.రామకృష్ణయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డిపోల్లో ఎన్/ఓ అలవెన్స్ చెల్లించాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కడప, బద్వేల్, మైదుకూరు డిపోలలో కండక్టర్, డ్రైవర్లకు ఫిక్స్‌డ్ చార్ట్ వేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను వేధిస్తున్న జమ్మలమడుగు డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లిటరసీ టెస్ట్ రాసిన డ్రైవర్లకు ఫలితాలు వెలువరించి ఇంక్రిమెంట్లు కలిపే ఏర్పాటుచేయాలని తెలిపారు. మహిళలకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని, గ్యారేజీ సిబ్బందికి సరైన టూల్స్ మెటీరియల్ సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ డిపో అధ్యక్షుడు పీవీసీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.అయ్యవారప్ప, జాయింట్ సెక్రటరి వీటీ రావు, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ జి.అమీనా, గ్యారేజ్ సెక్రటరీ ఎస్.అశోక్‌కుమార్, డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ చార్జీషీట్లను రద్దు చేయాలని ధర్నా

మైదుకూరు : డిపోలో అక్రమ చార్జీ షీట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మైదుకూరు ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జోనల్ చైర్మన్ వీఎస్ రాయుడు మాట్లాడుతూ జిల్లాలో అన్ని డిపోలలో ఎన్/ఓ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కడప, బద్వేలు, మైదుకూరు డిపోలలో నూతనంగా కండక్టర్లు, డ్రైవర్లకు ఫిక్స్‌డ్ చార్టులు వేయాలని కోరారు. సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్క్యులర్ నిబంధనల ప్రకారం స్పేర్‌లో ఉన్న సిబ్బందికి బలవంతపు సెలవులు వేసే విధానానికి స్వస్తి చెప్పాలని, మస్టర్ ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. గ్యారేజీ సిబ్బందికి సరైన టూల్స్, మెటీరియల్ సప్లై చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి బీఎస్‌రెడ్డి, అడిషనల్ సెక్రటరీ కుల్లాయప్ప పాల్గొన్నారు.

30 తులాల బంగారుతో ఉడాయింపు

ప్రొద్దుటూరు క్రైం : ఆభరణాలను తయారు చేయడానికి ఇచ్చిన 30 తులాల బంగారంతో స్వర్ణకారుడు ఉడాయించిన సంఘటన ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. టూ టౌన్ పోలీసుల తెలిపిన మేరకు.. బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఫిరోజ్ అనే స్వర్ణకారుడు ఆరేళ్లుగా ప్రొద్దుటూరులో ఉంటున్నాడు. మెయిన్‌బజార్‌లోని బంగారు వ్యాపారి సుబ్బయ్య తరచూ అతని వద్ద బంగారు ఆభరణాలు తయారు చేయించేవాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ఆభరణాలు తయారు చేయమని 30 తులాల బంగారు ఇచ్చాడు. చాలా రోజులైనా నగలు తీసుకొని రాకపోవడంతో సుబ్బయ్య అతని షాపు వద్దకు వెళ్లాడు. అతనికి ఫోన్ చేసినా పని చేయలేదు. దీంతో సుబ్బయ్య టూ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కలసపాడు : స్థానిక మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. బుధవారం మూడు రోడ్ల కూడలిలో వాహనదారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై వాహనాలను నిలపరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు లైసెన్సు పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు.